



# పిచ్‌లపై రచ్చ

**అంతర్జాతీయ స్థాయిలో గానీ ఐపీఎల్‌లో గానీ ఆయా జట్లు ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు సొంత వేదికలను తమకు అనుకూలంగా రూపొందించుకోవడం సర్వ సాధారణం. పిచ్‌లపై చర్చ (రచ్చ) ఈనాటిది కాదు. కానీ హోంగ్రౌండ్‌లో సొంత అభిమానుల మధ్య మ్యాచ్ ఆడుతూ ఓడటం ఏ జట్టుకైనా ఇబ్బందికర పరిస్థితే. కారణాలేవైనా తమ ఓటములకు జట్లన్నీ మూకుమ్మడిగా క్యూరేటర్ల మీదే భారం వేస్తున్నాయి. ఐపీఎల్-18లో ఇప్పుడిదే హాట్ టాపిక్!**

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

హైస్కోరింగ్ థ్రిల్లర్‌లు, ఆఖరి ఓవర్ ఫలితాల మధ్య ఆహ్లాదంగా సాగుతున్న ఐపీఎల్-18కు పిచ్‌ల వివాదం మరక అంటుకున్నది. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ (కోల్‌కతా X బెంగళూరు) నుంచి మొదలుకుని రెండ్రోజుల క్రితం ముగిసిన బెంగళూరు X ఢిల్లీ పోరు వరకూ పలుమార్లు ఆయా జట్ల సారథులు, మెంటార్‌లు తమ ఓటములకు పిచ్ క్యూరేటర్లను బాధ్యులను చేస్తున్నారు. క్యూరేటర్లు తమకు హోం అడ్వాంటేజీ లేకుండా చేస్తున్నారని వాపోతున్నారు. సొంత మైదానంలో పిచ్ కూడా ప్రత్యర్థులకు అనుకూలంగా మారితే ఇక తాము అద్దెలు కట్టి లాభమేంటని ఫ్రాంచైజీలు క్యూరేటర్లపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

### వేళ్లన్నీ క్యూరేటర్ వైపే..

ఈడెన్ గార్డెన్స్‌లో బెంగళూరు చేతిలో ఘోర పరాభవం తర్వాత కోల్‌కతా సారథి రహానే స్పందిస్తూ.. 'పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉంటుందని ఆశించాం. కానీ అలా జరుగలేదు. మా జట్టులో నాణ్యమైన స్పిన్నర్లు ఉన్నప్పటికీ మేం అనుకున్న విధంగా పిచ్ స్పందించలేదు' అని వ్యాఖ్యానించి ఈ వివాదానికి తెరలేపాడు. రహానే.. లక్నోతో ఓటమి అనంతరం 'పిచ్ గురించి ఇప్పటికే చాలా చర్చ నడుస్తున్నది. ఇప్పుడు నేనేమైనా చెబితే అది పెద్ద కాంట్రవర్సీ అవుతుంది' అని వ్యాఖ్యానించడం గమనార్హం. కేకేఆర్ సారథితో పాటు లక్నో సూపర్ జెయింట్స్ మెంటార్ జహీర్ ఖాన్ కూడా పంజాబ్‌తో పరాభవం తర్వాత మాట్లాడుతూ.. 'ఐపీఎల్‌లో హోంగేమ్ అంటే ఆతిథ్య జట్టుకు కాస్త అడ్వాంటేజ్ ఉంటుంది. కానీ మా క్యూరేటర్ మాత్రం దీనిని అలా భావించినట్టు లేదు. ఈ పిచ్‌ను చూస్తుంటే పంజాబ్ క్యూరేటర్ తయారు చేసినట్టుంది' అని వాపోయాడు. తాజాగా ఢిల్లీతో మ్యాచ్ ఓడాక బెంగళూరు మెంటార్ దినేశ్ కార్తీక్ సైతం ఇదే విధంగా వ్యాఖ్యానించాడు. 'చిన్నస్వామిలో మేం (ఆర్‌సీబీ) ఆడిన రెండు మ్యాచ్‌లలో మాకు బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌లు కావాలని కోరాం. కానీ ఇక్కడ బ్యాటింగ్ చేయడమే కష్టంగా మారింది' అని చెప్పడంతో ఈ వివాదం మరింత ముదిరింది. కోచ్‌లు, మెంటార్లే కాదు.. సైమన్ డౌల్ (న్యూజిలాండ్), హర్షా భోగ్లే వంటి క్రికెట్ విశ్లేషకులు సైతం క్యూరేటర్లను నిందిస్తున్నారు. ఐపీఎల్‌లో ఫ్రాంచైజీలు మైదానాలకు అద్దె కట్టి తీసుకుంటున్నప్పుడు క్యూరేటర్లు హోంటీమ్‌కు అనుకూలంగా పిచ్‌లు తయారు చేయకుంటే అక్కడ్నుంచి వేరే మైదానానికి మారిపోతే మంచిదని డౌల్ వ్యాఖ్యానించాడు.

### మీ వైఫల్యానికి మేం బాధ్యులమా?

పిచ్‌ల వివాదంపై క్యూరేటర్లు సైతం ఘాటుగానే స్పందిస్తున్నారు. ఈడెన్ గార్డెన్ పిచ్ క్యూరేటర్ సుజన్ ముఖర్జీ అయితే ఓ అడుగు ముందుకేసి 'మీ వైఫల్యానికి మేం బాధ్యులమా?' అంటూ గట్టిగానే కౌంటర్ ఇచ్చాడు. తొలి మ్యాచ్‌లో రహానే విమర్శలపై ముఖర్జీ మాట్లాడుతూ.. 'బీసీసీఐ మార్గదర్శకాల మేరకే పిచ్‌ను తయారు చేశాం. ఐపీఎల్ నిబంధనల ప్రకారం పిచ్‌ను ఇలా తయారు చేయాలని చెప్పే అధికారం ఫ్రాంచైజీలకు లేదు. నేనెప్పుడూ బంతికి బ్యాట్‌కు అనుకూలించే సమతూకమైన పిచ్‌ను తయారు చేస్తా. ఇక్కడ చాలాకాలంగా అలాంటి వికెట్‌నే రూపొందిస్తున్నాం. బెంగళూరుతో మ్యాచ్‌లో పిచ్ స్పిన్నర్లకు అనుకూలించింది. ఆర్‌సీబీ స్పిన్నర్లు వికెట్లు తీసినప్పుడు కోల్‌కతా స్పిన్నర్లు ఎందుకు తీయలేకపోయారు?' అని అన్నాడు.

### ఆడలేక మద్దెల ఓడు..

ఐపీఎల్‌లో హోం అడ్వాంటేజ్ సర్వ సాధారణమే అయినప్పటికీ చాలా సీజన్లుగా ఆయా వేదికల్లో మ్యాచ్‌లు ఆడుతున్న జట్లకు అన్ని వేదికలపై కచ్చితమైన అవగాహన ఉంటుంది. పిచ్ ఎలా స్పందిస్తుంది? అక్కడి పరిస్థితులు ఎలా ఉంటాయి? టాస్ వంటి ఇతరత్రా ఎన్నో అంశాలు మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశిస్తాయి. 2010 సీజన్ నుంచి చెన్నైలోని చెపాక్ స్టేడియంలో మ్యాచ్ గెలవని బెంగళూరు, ఢిల్లీ ఈ సీజన్‌లో ఎలా గెలిచాయి? వాంఖడేలోనూ బెంగళూరు చాలాకాలం తర్వాత బోణీ కొట్టింది. తాము సరిగ్గా రాణించక పిచ్‌ను నిందించడం చూస్తే ఆయా జట్ల పరిస్థితి ఆడలేక మద్దెల ఓడు అన్నట్టుగా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# చెన్నై చిత్తుచిత్తుగా..

## ధోనీ కెప్టెన్సీలోనూ మారని కింగ్స్ రాత

**బ్యాటింగ్ వైఫల్యంతో అవమానకర ఓటమి ● సునీల్ నరైన్ ఆల్‌రౌండ్ షో ● కోల్‌కతా భారీ విజయం**

చెన్నై: ఐపీఎల్‌లో ఐదు సార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)కు ఈ సీజన్‌లో సారథి మారినా ఆ జట్టు రాత మారలేదు. రుతురాజ్ గాయపడటంతో దిగ్గజ సారథి మహేంద్రసింగ్ ధోనీ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టినా.. చెపాక్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 8 వికెట్ల తేడాతో ఘోర ఓటమిని మూటగట్టుకుంది. బ్యాటింగ్ వైఫల్యంతో మొదట బ్యాటింగ్ చేసిన సీఎస్‌కే.. 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 103 పరుగులకే పరిమితమైంది. అందరూ విఫలమైనా గుడ్డిలో మెల్లలా శివమ్ దూబె (29 బంతుల్లో 31 నాటౌట్, 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' సునీల్ నరైన్ (3/13) బంతితో పాటు బ్యాట్ (18 బంతుల్లో 44, 2 ఫోర్లు, 5 సిక్సర్లు)తోనూ రాణించి కేకేఆర్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఛేదనను కోల్‌కతా 10.1 ఓవర్లలోనే దంచేసింది. ఈ సీజన్‌లో కోల్‌కతాకు ఇది మూడో విజయం కాగా చెన్నైకి ఇది వరుసగా ఐదో ఓటమి.

**సంక్షిప్త స్కోర్లు:**
చెన్నై: 20 ఓవర్లలో 103/9 (దూబె 31 నాటౌట్, విజయ్ 29, నరైన్ 3/13, హర్షిత్ 2/16)
కోల్‌కతా: 10.1 ఓవర్లలో 107/2 (నరైన్ 44, డికాక్ 23, నూర్ 1/8, అన్షుల్ 1/19)

### వచ్చారు.. వెళ్లారు..

31/2. తొలి పవర్ ప్లే ముగిసేసరికి చెన్నై స్కోరిది. ప్రత్యర్థి జట్లన్నీ పవర్ ప్లేలో వీరబాదుడు బాదుతూ వీలైనన్ని ఎక్కువ పరుగులు రాబడుతుంటే చెన్నై ఆటతీరు మాత్రం నానాటికీ తీసికట్టుగా మారుతుందనడానికి ఈ స్కోరే నిదర్శనం. ఈ సీజన్‌లో దారుణంగా విఫలమవుతున్న రచిన్ (4) మళ్లీ నిరాశపరచగా కాన్వే (12), రుతురాజ్ స్థానంలో వచ్చిన త్రిపాఠి (16) అతడినే అనుసరించారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోషన్ పొందిన విజయ్ శంకర్ (29) నిలదొక్కుకున్నట్టే కనిపించినా స్పిన్నర్ల రాకతో అతడూ నిష్క్రమించాడు. కోల్‌కతా స్పిన్నర్ల ధాటికి చెన్నై మిడిలార్డర్ పేకమేడలా కుప్పకూలింది. అశ్విన్ (1) సింగిల్ డిజిట్‌కే పరిమితమవగా జడేజా, దీపక్ హుడా డకౌట్ అయ్యారు. చెన్నై భారీ ఆశలు పెట్టుకున్న సారథి ధోనీ (1) కూడా ఒక్క పరుగుకే పెవిలియన్ చేరాడు. దూబె ఆఖరిదాకా క్రీజులో నిలిచినా అతడూ బ్యాట్ ఝుళిపించలేకపోయాడు. ఐపీఎల్‌లో చెన్నైకి ఇది రెండో అత్యల్ప స్కోరు కాగా చెపాక్‌లో ఇదే మొదటిది. నరైన్‌తో పాటు కోల్‌కతా బౌలర్లలో వరుణ్ చక్రవర్తి (2/22), హర్షిత్ రాణా (2/16) పొదుపుగా బౌలింగ్ చేసి చెన్నైని కట్టడిచేశారు.

### దంచిన నరైన్

స్వల్ప లక్ష్యాన్ని తొందరగా పూర్తిచేసి నెట్ రన్‌రేట్‌ను పెంచుకోవాలనే ఉద్దేశంతో బరిలోకి దిగిన కేకేఆర్ తొలి ఓవర్ నుంచే దూకుడుగా ఆడింది. ఖలీల్ తొలి ఓవర్లో డీప్ మిడ్ వికెట్ మీదుగా భారీ సిక్సర్‌తో ఛేదన మొదలెట్టిన నరైన్.. క్రీజులో ఉన్నంతసేపు దూకుడుగా ఆడాడు. డికాక్ (23) మూడు సిక్సర్లు కొట్టి ఊపుమీదే కనిపించినా తక్కువ స్కోరుకే నిష్క్రమించాడు. కానీ రహానే అండతో నరైన్ రెచ్చిపోయాడు. ఖలీల్ 6వ ఓవర్లో 6, 4తో రెచ్చిపోయాడు. రహానే, రింకూ గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశారు.

**1** — చెపాక్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిపోవడం చెన్నైకి ఇది తొలిసారి

ఐపీఎల్‌లో చెన్నై వరుసగా ఐదు మ్యాచ్‌లు ఓడిపోవడం ఇది మొదటిసారి

**పాయింట్ల పట్టిక**

| జ | మ్యా | గె | ఓ | పా | ర.రే |
|---|---|---|---|---|---|
| గుజరాత్ | 5 | 4 | 1 | 8 | 1.41 |
| ఢిల్లీ | 4 | 4 | 0 | 8 | 1.27 |
| కోల్‌కతా | 6 | 3 | 3 | 6 | 0.80 |
| బెంగళూరు | 5 | 3 | 2 | 6 | 0.53 |
| పంజాబ్ | 4 | 3 | 1 | 6 | 0.28 |
| లక్నో | 5 | 3 | 2 | 6 | 0.07 |
| రాజస్థాన్ | 5 | 2 | 3 | 4 | -0.73 |
| ముంబై | 5 | 1 | 4 | 2 | -0.01 |
| చెన్నై | 6 | 1 | 5 | 2 | -1.55 |
| హైదరాబాద్ | 5 | 1 | 4 | 2 | -1.62 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

## భారత్‌కు మూడో విజయం

పుణె: ప్రతిష్టాత్మక బిల్లీ జీన్‌కింగ్ కప్‌లో భారత్ మూడో విజయం నమోదు చేసింది. గ్రూప్-1 ఆసియా ఓషియానాలో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్.. 2-1తో చైనీస్ తైపీపై గెలిచింది. మహిళల సింగిల్స్‌లో వైదేహి 6-2, 5-7, 6-4తో ఫంగ్ అన్ లిన్‌ను చిత్తుచేసింది. మరో సింగిల్స్‌లో శ్రీవల్లి రష్మిక 6-2, 7-6 (7/3)తో గార్లాండ్‌ను మట్టికరిపించింది. డబుల్స్ పోరులో అంకిత-ప్రార్థన జోడీ ఓటమిపాలైంది.

## పసిడి పోరుకు జ్యోతి జోడీ



ఫ్లోరిడా(అమెరికా): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1లో భారత ఆర్చర్లు సత్తా చాటుతున్నారు. శుక్రవారం ఇక్కడ జరిగిన మహిళల కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, రిషభ్ యాదవ్ జోడీ 159-155తో ఎల్లిసన్, జెవ్సినిక్ (స్లోవేనియా)ను ఓడించి ఫైనల్ చేరింది. తొలి రౌండ్‌లో స్పెయిన్‌ను క్వార్టర్స్‌లో డెన్మార్క్‌ను చిత్తుచేసి ఫైనల్ చేరిన భారత జట్టు.. టైటిల్ పోరులో చైనీస్ తైపీతో తలపడనుంది. కానీ రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ క్వార్టర్స్‌లో అన్షిక-ధీరజ్ ద్వయం 2-6తో ఎలియా-పాబ్లో(స్పెయిన్) చేతిలో ఓడింది.

## ధ్రువ్,క్రాస్టో ద్వయం నిష్క్రమణ

నింగ్బొ (చైనా): బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత టైటిల్ ఆశలు మోస్తున్న మిక్స్‌డ్ డబుల్స్ ద్వయం ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్స్ పోరులో కపిల-క్రాస్టో జోడీ 20-22, 13-21తో ఐదో సీడ్ టాంగ్ చున్ మన్ - సెయింగ్ సుయెట్ (హాంకాంగ్) చేతిలో పరాజయం పాలైంది. తొలి గేమ్‌లో పోరాడి ఓడిన భారత జంట.. రెండో గేమ్‌లో చేతులెత్తేసి మ్యాచ్‌ను చేజార్చుకుంది.

## వందేళ్ల నిరీక్షణ ఫలం



ప్రపంచ సినిమాలో ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ పురస్కారాల్లో 'బెస్ట్ స్టంట్ డిజైన్' పేరుతో కొత్త కేటగిరీని తీసుకొచ్చారు. ఈ విషయాన్ని ఆస్కార్ కమిటీ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. అద్భుత పోరాటఘట్టాలతో ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసిన చిత్రాలను ఈ విభాగం క్రింద ఎంపిక చేయనున్నారు. ఈ కేటగిరీ అనౌన్స్‌మెంట్ సందర్భంగా ఆస్కార్ కమిటీ.. 'మిషన్ ఇంపాజిబుల్' 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రాలతో పాటు 'ఆర్ఆర్ఆర్' చిత్రాలతో కూడిన పోస్టర్‌ను సోషల్‌మీడియాలో పంచుకుంది. 2028లో ఆస్కార్ వందేళ్ల ఉత్సవాన్ని పురస్కరించుకొని 'బెస్ట్ స్టంట్ డిజైన్' కేటగిరీలో తొలి అవార్డును అందించనున్నారు. ఈ నేపథ్యంలో అగ్ర దర్శకుడు రాజమౌళి తన ఎక్స్ ఖాతాలో ఆస్కార్ కమిటీ నిర్ణయంపై ఆనందం వ్యక్తం చేశారు. 'వందేళ్ల నిరీక్షణ తర్వాత ఆస్కార్ కమిటీ 'స్టంట్ డిజైన్' విభాగంలో అవార్డును ప్రకటించడం ఆనందంగా ఉంది. ఇదొక చారిత్రాత్మక సందర్భం. ఈ కేటగిరీ కోసం కృషి చేసిన స్టంట్ కమ్యూనిటీకి, ఆస్కార్ కమిటీకి నా కృతజ్ఞతలు. అన్నింటికంటే ముఖ్యంగా 'ఆర్ఆర్ఆర్'కు సంబంధించిన యాక్షన్ విజువల్స్‌ను అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో జత చేయడం థ్రిల్లింగ్‌గా అనిపించింది' అని రాజమౌళి పేర్కొన్నారు.

## మిమ్మల్ని చూస్తే భయమేస్తుంది!




సోషల్‌మీడియా ట్రోలర్స్‌పై అగ్ర కథానాయిక త్రిష ఆగ్రహం వ్యక్తం చేసింది. వారిది విషపూరిత మనస్తత్వమని, అలాంటి వారు రాత్రిళ్లు ప్రశాంతంగా ఎలా నిద్రపోగలుగుతారని ప్రశ్నించింది. 'పనీపాట లేకుండా ఖాళీగా ఉంటూ పిచ్చి పోస్ట్‌లతో కాలక్షేపం చేయడమేనా మీ పని? నిజంగా మిమ్మల్ని చూస్తే భయమేస్తుంది. అలాగే మీతో పాటు ఉండే సన్నిహితులు, స్నేహితుల విషయంలో బాధగా అనిపిస్తున్నది. పిరికివారు, మానసిక స్థితి సరిగ్గా లేని వారు మాత్రమే అకారణంగా విద్వేషాన్ని ప్రదర్శిస్తారు. మీ అందరికి మంచి బుద్ధిని ప్రసాదించాలని ఆ దేవున్ని కోరుకుంటున్నా' అని త్రిష ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. గతంలో కూడా సోషల్‌మీడియా తప్పుడు వార్తలపై త్రిష అసహనం వ్యక్తం చేసింది. అజిత్‌తో కలిసి త్రిష నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమాలో త్రిష పర్‌ఫార్మెన్స్‌పై కొందరు ట్రోల్స్ చేశారు. తమిళ అమ్మాయి అయివుండి వేరే వాళ్లతో డబ్బింగ్ చెప్పించడం ఏమాత్రం బాగోలేదని విమర్శలొచ్చాయి. ఈ నేపథ్యంలో ట్రోలర్స్‌ను ఉద్దేశించి త్రిష తాజా పోస్ట్ పెట్టిందని అంటున్నారు.

## మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో?



అల్లు అర్జున్-అట్లీ కాంబినేషన్‌లో పాన్ వరల్డ్ సినిమా ప్రకటన ఇటీవల వెలువడిన విషయం తెలిసిందే. ఈ సంవత్సరాంతంలో ఈ ప్రాజెక్ట్ సెట్స్‌మీదకు వెళ్లనుంది. భారీ విజువల్స్‌తో హాలీవుడ్ స్థాయి హంగులతో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించనుంది. 'పుష్ప' ఫ్రాంచైజీ తర్వాత అల్లు అర్జున్ నటిస్తున్న చిత్రమిదే కావడంతో దేశవ్యాప్తంగా అభిమానులు ఈ సినిమా అప్‌డేట్స్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ సినిమా కథాంశం ఏమిటన్నది సస్పెన్స్‌గా మారింది. ఈ విషయంలో భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. భారతీయ మూలాల నేపథ్యంలో సాగే సైన్స్ ఫిక్షన్ ఇదని, సూపర్‌హీరో తరహాలో ఉంటుందని కొందరు ఊహాగానాలు చేస్తుండగా, మరికొందరేమో మాఫియా నేపథ్యంలో నడిచే కథాంశమిదని చెబుతున్నారు. ఓ ఇంటర్నేషనల్ డాన్ చుట్టూ అల్లుకున్న ఈ కథ ఇండియన్ స్క్రీన్‌పై మునుపెన్నడూ చూడని మేకింగ్‌తో ప్రేక్షకుల్ని అబ్బురపరుస్తుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇవన్నీ కేవలం ఊహాగానాలేనని, చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వస్తేనే కథాంశం విషయంలో స్పష్టత వస్తుందంటున్నారు.

చిత్రం



## ధిక్కారమే వీరమల్లు నైజం

అగ్ర హీరో పవన్‌కల్యాణ్ చారిత్రక చిత్రం 'హరిహర వీరమల్లు' వేసవి బరిలో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నది. మే 8న పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదలకానుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని మేకర్స్ తెలిపారు. శుక్రవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'చారిత్రక యోధుడు వీరమల్లుగా పవన్‌కల్యాణ్ సరికొత్త అవతారంలో కనిపిస్తారు. అణువణువునా ధిక్కార స్వభావం, న్యాయం కోసం తపించే వ్యక్తిగా ఆయన పాత్ర శక్తివంతంగా సాగుతుంది. మొఘల్ రాజుల కాలం నాటి ఈ కథ ఆద్యంతం ఉత్కంఠభరితమైన మలుపులతో నడుస్తుంది. పీడితుల పక్షాన వీరమల్లు యుద్ధం రోమాంచితంగా అనిపిస్తుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి తొలుత క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. ఆ తర్వాత ఏ.ఎం.జ్యోతికృష్ణ దర్శకుడిగా బాధ్యతలు స్వీకరించి సినిమాను పూర్తి చేశారు. నిధి అగర్వాల్, బాబీ డియోల్, అనుపమ్‌ఖేర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కీరవాణి, నిర్మాత: ఏ.దయాకర్ రావు.

## కేన్స్ చిత్రోత్సవంలో 'హోమ్ బౌండ్'



ఇషాన్ ఖట్టర్, జాన్వీకపూర్ కీలక పాత్రల్లో నటించిన 'హోమ్ బౌండ్' చిత్రం ప్రతిష్టాత్మక కేన్స్ అంతర్జాతీయ చిత్రోత్సవంలో ప్రదర్శితం కానుంది. 'అన్ సర్టెన్ రిగార్డ్' కేటగిరిలో ఈ సినిమాను స్క్రీనింగ్ చేయబోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా కళాత్మక విలువలతో రూపొందించిన చిత్రాలను ఈ విభాగంలో ప్రదర్శిస్తారు. హైదరాబాద్‌కు చెందిన నీరజ్ ఘైవాన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఆయన తొలిచిత్రం 'మసాన్' (2015) సైతం కేన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ప్రదర్శనకు ఎంపిక కావడం విశేషం. మే 13 నుంచి 24 వరకు ఫ్రాన్స్ వేదికగా జరగనున్న 78వ కేన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో 'హోమ్ బౌండ్' చిత్రాన్ని ప్రదర్శించనున్నారు. తన సినిమా కేన్స్‌కు ఎంపిక కావడం పట్ల జాన్వీకపూర్ ఇన్‌స్టా వేదికగా ఆనందం వ్యక్తం చేసింది. భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచానికి తెలియజెప్పిన క్షణాలివని, ఇది తన బృందం మొత్తానికి దక్కిన గౌరవమని వ్యాఖ్యానించింది. భారతీయ కథల గొప్పదనాన్ని ప్రపంచం గుర్తిస్తున్నదని చిత్ర నిర్మాతల్లో ఒకరైన కరణ్‌జోహార్ అన్నారు.

## రిస్క్ ఉంటేనే సక్సెస్ అవుతాం



'సినిమాల మీద పాషన్‌తో ఇండస్ట్రీలోకి వచ్చాను. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను ప్రేక్షకులకు అందించాలన్నదే నా లక్ష్యం' అన్నారు నిర్మాత డి.మధు. ఆయన నిర్మించిన తాజా చిత్రం 'ఓదెల-2' ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకురానుంది. తమన్నా నాగసాధువు పాత్రలో డివోషనల్‌గా థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సంపత్‌నంది సూపర్‌విజన్‌లో అశోక్‌తేజ డైరెక్ట్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాత డి.మధు పాత్రికేయులతో ముచ్చటించారు. 'ఓదెల' తొలిభాగం తనను బాగా ఎక్సైట్ చేసిందని, అందుకే సీక్వెల్‌లో భాగమయ్యానని ఆయన తెలిపారు. నాగసాధువు పాత్రలో తమన్నా పర్‌ఫార్మెన్స్ హైలైట్‌గా నిలుస్తుందని, కథలో ప్రతీ పాత్రకు ప్రాధాన్యత ఉంటుందని, పంచభూతాల కాన్సెప్ట్‌ని గ్రాఫిక్స్‌లో చూపించడం థ్రిల్లింగ్‌గా అనిపిస్తుందని చెప్పారు. 'ఇది సూపర్‌నేచురల్ కథ అయినా..ఎక్కడా లాజిక్ మిస్ చేయకుండా తెరకెక్కించాం. అన్నింటిని ఆధారాలతో చూపించాం. నిర్మాణంలో ఎక్కడా రాజీపడకుండా గ్రాండ్ స్కేల్‌లో సినిమాను తెరకెక్కించాం. సినిమా ప్రమోషన్స్ కూడా వినూత్నంగా నిర్వహిస్తున్నాం. మహాకుంభమేళాలో టీజర్‌ను లాంచ్ చేశాం. అంత రిస్క్ ఎందుకు చేశారని చాలా మంది అడిగారు. నా దృష్టిలో ఎక్కడైతే రిస్క్ ఉంటుందో అక్కడే సక్సెస్ ఉంటుంది. భవిష్యత్తు సంపత్‌నందితో కలిసి మరిన్ని సినిమాలు చేస్తా' అని డి.మధు తెలిపారు.



## అన్నాదమ్ముల అనుబంధం

'అప్‌డేట్ అయిన తమ్ముడు, అమాయకుడైన అన్న మధ్య జరిగే స్వచ్ఛమైన కథ ఇది. నా రియల్‌లైఫ్ క్యారెక్టర్ ఈ సినిమాలో కనిపిస్తుంది' అన్నారు సంపూర్ణేష్ బాబు. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'సోదరా'. మోహన్ మేనంపల్లి దర్శకుడు. సంజోష్, ప్రాచీబంసాల్, ఆరతి గుప్తా ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నెల 25న విడుదలకానుంది. గురువారం ట్రైలర్‌ను దర్శకుడు సాయిరాజేష్, నిర్మాత ఎస్‌కేఎన్ ఆవిష్కరించారు. సంపూర్ణేష్‌బాబుతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, సంపాదించిన డబ్బుతో అందరికి సహాయం చేస్తుంటాడని, ఆయన నిజమైన స్టార్ అని సాయిరాజేష్ అన్నారు. ఒక షో బుక్ చేసి మిత్రులందరికి ఈ సినిమా చూపిస్తానని ఎస్‌కేఎన్ తెలిపారు. అన్నదమ్ముల అనుబంధం విలువ చెప్పే చిత్రమిదని హీరో సంజోష్ పేర్కొన్నారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.